నేటి మ్యాచ్
భారత్ X దక్షిణాఫ్రికా
మ. 2.00 నుంచి
వేదిక: కోల్‌కతా

పాక్ న్యూజిలాండ్‌పై విజయం • ఫఖర్ మెరుపు సెంచరీ • రచిన్ సెంచరీ వృథా

పోటీలోనే..

రచిన్ (108)

ఫఖర్ (126*)

1 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌కు ఇదే (401/6) అత్యధిక స్కోరు.

అనిశ్చితికి మారుపేరైన పాకిస్థాన్.. వరల్డ్‌కప్‌లో అత్యవసర విజయాన్ని ఖాతాలో వేసుకుంది. 1992 ప్రపంచకప్ తరహాలో వర్షానికి, అదృష్టం తోడవడంతో.. నాలుగో విజయంతో సెమీస్ రేసులో నిలిచింది. పరుగుల వరద పారిన పోరులో మొదట రచిన్ రవీంద్ర, విలియమ్సన్ దంచికొడితే.. ఆనక పాక్ ఓపెనర్ జమాన్ బంతిపై పగబట్టినట్లు శివతాండవమాడాడు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతితో పాక్‌కు విజయ సమీకరణం సులువు కాగా.. నాలుగొందల పైచిలుకు స్కోరు చేసినా కివీస్‌కు వరుసగా నాలుగో ఓటమి తప్పలేదు!

బెంగళూరు: సెమీఫైనల్ రేసులో నిలువాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో పాకిస్థాన్ సత్తా చాటింది. పరుగుల వరద పారిన పోరులో అదృష్టం వరుణుడి రూపంలో తోడవడంతో వన్డే ప్రపంచకప్‌లో పాక్ నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. శనివారం జరిగిన తొలి పోరులో పాకిస్థాన్ 21 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. దీంతో ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో 8 పాయింట్లు ఖాతాలో వేసుకున్న పాకిస్థాన్ పట్టికలో ఐదో స్థానంలో నిలువగా.. వరుసగా నాలుగో ఓటమి మూటగట్టుకున్న న్యూజిలాండ్ నిలకడగా నాలుగో ప్లేస్‌లో కొనసాగుతున్నది. చిన్నస్వామి స్టేడియంలో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 401 పరుగులు చేసింది. రచిన్ రవీంద్ర (108; 15 ఫోర్లు, ఒక సిక్సర్) మరో సెంచరీతో చెలరేగితే.. గాయం నుంచి కోలుకొని వచ్చిన కెప్టెన్ కేన్ విలియమ్సన్ (79 బంతుల్లో 95; 10 ఫోర్లు, 2 సిక్సర్లు) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. గ్లెన్ ఫిలిప్స్ (41), మార్క్ చాప్‌మన్ (39), కాన్వే (35) కూడా రాణించారు. పాకిస్థాన్ బౌలర్లలో వసీమ్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం పాకిస్థాన్ దంచికొడుతున్న సమయంలో మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించింది. దీంతో మొదట పాక్ లక్ష్యాన్ని 41 ఓవర్లలో 342కు కుదించినా.. మరోసారి వరుణుడు అడ్డుపడ్డాడు. అప్పటికి బాబర్ సేన 25.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 200 పరుగులు చేసి డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 21 పరుగులు ముందంజలో నిలువడంతో.. పాకిస్థాన్‌ను విజేతగా ప్రకటించారు. ఓపెనర్ ఫఖర్ జమాన్ (81 బంతుల్లో 126 నాటౌట్; 8 ఫోర్లు, 11 సిక్సర్లు) కివీస్ బౌలర్లతో చెడుగుడు ఆడుకోగా.. కెప్టెన్ బాబర్ ఆజమ్ (66 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆకట్టుకున్నాడు. ఫఖర్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

1 వరల్డ్‌కప్‌లో నాలుగొందల పైచిలుకు పరుగులు చేసిన తర్వాత పరాజయం పాలైన తొలి జట్టుగా న్యూజిలాండ్ నిలిచింది.

స్కోర్లు సంక్షిప్తం: న్యూజిలాండ్: 401/6 (రచిన్ 108, విలియమ్సన్ 95; వసీమ్ 3/60), **పాకిస్థాన్:** 25.3 ఓవర్లలో 200/1 (ఫఖర్ 126 నాటౌట్, బాబర్ 66 నాటౌట్; సౌథీ 1/27).

అప్పుడేం జరిగిందో తెలుసా!

1992 వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్ దాదాపు ఇలాంటి పరిస్థితే ఎదుర్కొంది. ఇమ్రాన్ ఖాన్ సారథ్యంలో బరిలోకి దిగిన పాక్.. లీగ్ దశలో ఆడిన 8 మ్యాచ్‌ల్లో నాలుగింట మాత్రమే నెగ్గింది. ఆ టోర్నీ కూడా రౌండ్ రాబిన్ పద్ధతిలోనే జరగగా.. జింబాబ్వే, ఆస్ట్రేలియా, శ్రీలంక, న్యూజిలాండ్‌పై పాక్ నెగ్గింది. ఇంగ్లండ్‌తో మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా.. ఆ పోరులో పాక్ జట్టు 74 పరుగులకే ఆలౌటైంది. లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ విజయం నల్లేరుపై నడకే అనుకుంటే.. భారీ వర్షం వల్ల మ్యాచ్ తుడిచిపెట్టుకుపోయింది. అలా అనుకోకుండా అదృష్టం కలిసి వచ్చి 9 పాయింట్లతో నాకౌట్ దశకు చేరిన పాకిస్థాన్.. సెమీస్‌లో న్యూజిలాండ్‌పై ఫైనల్లో ఇంగ్లండ్‌పై గెలిచి.. తొలిసారి విశ్వ విజేతగా అవతరించింది.

సఫారీ సవాల్

నేడు దక్షిణాఫ్రికాతో భారత్ ఢీ

వన్డే ప్రపంచకప్‌లో అసలు సిసలు సమఉజ్జీల పోరుకు రంగం సిద్ధమైంది. ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన టీమ్‌ఇండియా.. బాదుడే పరమావధిగా భారీ స్కోర్లు నమోదు చేస్తున్న దక్షిణాఫ్రికాతో అమీతుమీకి రెడీ అయింది. సఫారీల బ్యాటింగ్‌కు భారత బౌలింగ్‌కు మధ్య సమరంగా భావిస్తున్న పోరులో ఎవరిది పైచేయి అవుతుందో చూడాలి! పుట్టినరోజు (ఆదివారం) నాడు విరాట్ వీరోచిత ఇన్నింగ్స్ కోసం అభిమానుల ఎదురుచూపులు ఈడెన్ గార్డెన్స్‌లో ఫలించాలని ఆశిద్దాం!

కోల్‌కతా: ప్రత్యర్థులతో సంబంధం లేకుండా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతూ టాప్‌గేర్‌లో దూసుకుపోతున్న భారత జట్టు ఆదివారం మరో కీలక మ్యాచ్ ఆడనుంది. ఆస్ట్రేలియా, పాకిస్థాన్, న్యూజిలాండ్, ఇంగ్లండ్ ఇలా ఎదురైన ప్రతి జట్టును మట్టికరిపించిన రోహిత్ సేన.. సఫారీలతో సమరానికి సై అంటున్నది. బలాబలాల దృష్ట్యా ఇరు జట్లు సమ ఉజ్జీలుగా కనిపిస్తున్నా.. సఫారీల బౌలింగ్ దాడి కన్నా మన పేస్ బలంగా ఉందనేది వాస్తవం. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత బౌలర్లను సవాలు చేయగల బ్యాటింగ్ యూనిట్ తారస పడలేదనే భావన ప్రతి ఒక్కరిలో ఉండగా.. ఈ మ్యాచ్‌లో అలాంటి ఆర్డర్ ఎదురుపడనుంది. వరల్డ్‌కప్‌లో భారత జైత్రయాత్రను అడ్డుకోవడమే తమ లక్ష్యమని ప్రొటీస్ కెప్టెన్ బవుమా మ్యాచ్‌కు ముందురోజు వెల్లడించాడు. న్యూజిలాండ్‌పై పాకిస్థాన్ గెలవడంతో సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్న దక్షిణాఫ్రికా పాయింట్ల పట్టికలో టాప్-2లో నిలువడం ఖాయమే కావడంతో ఫైనల్‌కు ముందు ఈ మ్యాచ్‌ను రిహార్సల్‌గా భావించొచ్చు. లేటు వయసులో ఘాటు ఆటతో ఆకట్టుకుంటున్న డికాక్‌తో పాటు డసెన్, మార్క్‌రమ్, క్లాసెన్, మిల్లర్, జాన్సెన్‌తో కూడిన దక్షిణాఫ్రికా బ్యాటింగ్ లైనప్‌ను బుమ్రా, షమీ, సిరాజ్ త్రయం ఎలా అడ్డుకట్ట వేస్తుందనే దానిపైనే ఈ మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది. బ్యాటింగ్‌లో బర్త్‌డే బాయ్ విరాట్ కోహ్లీతో పాటు కెప్టెన్ రోహిత్ శర్మ, గిల్, శ్రేయస్, రాహుల్, సూర్య కీలకం కానున్నారు.

2011లో స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్ లీగ్ దశలో భారత్ కేవలం దక్షిణాఫ్రికా చేతిలో మాత్రమే ఓడి.. మిగిలిన మ్యాచ్‌లన్నీ గెలిచి విశ్వ విజేతగా నిలిచింది.

గాయంతో పాండ్యా ఔట్

ప్రసిద్ధ్ కృష్ణకు పిలుపు

కోల్‌కతా: ప్రపంచకప్‌లో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. గాయం కారణంగా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా..మెగాటోర్నీలో మిగతా మ్యాచ్‌లకు పూర్తిగా దూరమయ్యాడు. ఈ విషయాన్ని బీసీసీఐ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా బౌలింగ్ వేస్తున్న క్రమంలో హార్దిక్ గాయపడ్డాడు. అప్పటి నుంచి జట్టుకు దూరమైన హార్దిక్..జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)లో పునరావాసం పొందుతున్నాడు. అయితే కాలి మడమ దగ్గర వాపు ఉండటం, పూర్తిగా మానేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో హార్దిక్ స్థానంలో కర్నాటక యువ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణను ఎంపిక చేశారు.

టైటిల్ పోరుకు పంజాబ్, బరోడా

మొహాలి : సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 టోర్నీలో పంజాబ్, బరోడా జట్లు టైటిల్ పోరుకు సిద్ధమయ్యాయి. శనివారం జరిగిన సెమీఫైనల్స్‌లో పంజాబ్ 6 వికెట్ల తేడాతో ఢిల్లీపై, బరోడా 6 వికెట్లతో అస్సాంపై గెలుపొందాయి. తొలి సెమీస్‌లో తొలుత ఢిల్లీ జట్టు 7 వికెట్లకు 183 పరుగులు చేయగా, సమాధానంగా పంజాబ్ 4 వికెట్లకు 184 పరుగులు చేసి గెలుపొందింది.

ఫైనల్లో భారత్

రాంచి : ఆసియన్ చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో భారత మహిళల జట్టు టైటిల్ పోరుకు చేరుకుంది. శనివారం జరిగిన సెమీఫైనల్లో భారత జట్టు 2-0తో దక్షిణ కొరియాను ఓడించి ఫైనల్లో జపాన్‌తో పోరుకు సిద్ధమైంది. భారత జట్టుకు సలిమా టెటె(11ని.), వైష్ణవి విట్టల్ ఫాల్కె(19ని.) గోల్స్ సాధించిపెట్టారు. మరో సెమీఫైనల్లో జపాన్ 2-1తో చైనాను ఓడించింది.

ఆసీస్ అలవోకగా

ఇంగ్లండ్‌పై విజయకేతనం



జాంపా (29; 3/21)

అహ్మదాబాద్: వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా వరుసగా ఐదో విజయం ఖాతాలో వేసుకుంది. శనివారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆసీస్ 33 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను మట్టికరిపించింది. ఈ విజయంతో కంగారూలు సెమీస్ బెర్త్‌కు మరింత చేరువ కాగా.. ఇంగ్లండ్ ఏడింట ఆరో ఓటమితో అధికారికంగా సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. లబుషేన్ (71) హాఫ్ సెంచరీతో రాణించగా.. స్మిత్ (44), గ్రీన్ (47), స్టోయినిస్ (35), జాంపా (29) కీలక పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో వోక్స్ 4 వికెట్లు పడగొట్టాడు. చేజింగ్‌లో ఇంగ్లండ్ 48.1 ఓవర్లలో 253 పరుగులకు ఆలౌటైంది. స్టోక్స్ (64), మలాన్ (50), మొయిన్ అలీ (42) పోరాడినా ఫలితం లేకపోయింది. ఆసీస్ బౌలర్లలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' జాంపా 3 వికెట్లు తీశాడు.

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
భారత్ ✓	7	7	0	+2.10	14
దక్షిణాఫ్రికా ✓	7	6	1	+2.29	12
ఆస్ట్రేలియా	7	5	2	+0.92	10
న్యూజిలాండ్	8	4	4	+0.39	8
పాకిస్థాన్	8	4	4	+0.03	8
అఫ్గానిస్థాన్	7	4	3	-0.33	8
శ్రీలంక	7	2	5	-1.16	4
నెదర్లాండ్స్	7	2	5	-1.39	4
బంగ్లాదేశ్ X	7	1	6	-1.44	2
ఇంగ్లండ్ X	7	1	6	-1.50	2

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

శ్రీవల్లి, శివానీ జోడీకి రజతం

పనాజీ: గోవా వేదికగా జరుగుతున్న నేషనల్‌గేమ్స్‌లో రాష్ట్ర టెన్నిస్ ద్వయం శ్రీవల్లి రష్మిక, శ్రావ్య శివానీ జోడీ రజత పతకంతో మెరిసింది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ ఫైనల్లో శ్రీవల్లి, శివానీ ద్వయం 3-6, 1-6తో రుతుజా బోంస్లే, ప్రార్థనా త్రొంబె జంట(మహారాష్ట్ర) చేతిలో ఓడారు మరో వైపు సింగిల్స్‌లో రష్మిక ఫైనల్లోకి ప్రవేశించి కనీసం రజతం ఖాయం చేసుకుంది.

విద్యావంతుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న వినోద్. పక్కన చీఫ్ విప్ దాస్యం

ప్రైవేట్ టీచర్ల సంరక్షణకు చట్టం అవసరం

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

హనుమకొండ, నవంబర్ 4: విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ప్రైవేట్ ఉపాధ్యాయులకు సంరక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు బీఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్ అండగా నిలుస్తారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని ఎస్వీ కన్వెన్షన్‌లో విద్యావంతుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో ప్రైవేట్ విద్యా సంస్థల యజమానులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలపై తనకు అవగాహన ఉందని, తాను ఎంపీగా ఉన్నప్పుడు ప్రైవేటు ఉపాధ్యాయుల సంరక్షణ చట్టం కోసం ప్రయత్నించానని, రాబోయే రోజుల్లో ఈ దిశగా కృషి చేస్తానని చెప్పారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్ బాస్కర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. చీఫ్ విప్ దాస్యం వినయ్ బాస్కర్ మాట్లాడుతూ.. కరోనా కష్ట కాలంలో ప్రైవేట్ ఉపాధ్యాయులకు అండగా నిలిచానని గుర్తుచేశారు. ప్రతి ఉపాధ్యాయుడు తన గెలుపునకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమ్మేళనంలో కూడా చైర్మన్ సుందర్‌రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే.. కాళరాత్రులే గతి

- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రజల కష్టాలు దూరం
- ఎన్నికల ప్రచారంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం దోన్‌పాల్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, నవంబర్ 4: అబద్ధాల కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లేస్తే.. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో మళ్లీ కాళరాత్రులే మిగులుతాయని బీఆర్ఎస్ బాల్కొండ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. శనివారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని సుంకెట్, దోన్‌పాల్, గాండ్లపేట్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ.. కాంగ్రెస్ వాళ్ల మాటలు నమ్మి వారికి ఓటేస్తే.. కరెంటు ఎప్పుడు వస్తుందో.. పోతుందో వేచిచూడాల్సిన పరిస్థితులు ఉంటాయని, అర్ధరాత్రుల్లో కాళ్లు కాలువలో పెట్టి పడుకోవాల్సిన రోజులు తిరిగి వస్తాయని హెచ్చరించారు. మొన్ననే కర్ణాటకలో గెలిచిన కాంగ్రెస్ పార్టీ వ్యవసాయానికి 5 గంటల కరెంటు కూడా ఇవ్వలేని స్థితిలో ఉందని దుయ్యబట్టారు. మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉన్న ప్రాంతంలో సాగుకు 5హెచ్‌పీ మోటరుకు కనెక్షన్ కావాలంటే ప్రభుత్వానికి రూ.2 లక్షలు కట్టాలి, కనెక్షన్ తీసుకోవడానికి ఖర్చులు, ఇక ఏటా సాగునీరు కోసం రూ.10,500 చెల్లించాలి. వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చేయని పనులు తెలంగాణలో ఏవిధంగా చేస్తారో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. కాంగ్రెస్ 50 ఏండ్లు, టీడీపీ పొత్తుతో 20 ఏండ్లు పాలించిన బీజేపీలు ఇంటింటికీ నల్లాలు, ఆడబిడ్డల పెండ్లిలకు కల్యాణలక్ష్మి, బీడీ కార్మికులకు పింఛన్, రైతులకు సాగునీరు, రైతుబంధు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఏ రాష్ట్రంలో చేయని విధంగా ఇక్కడ అభివృద్ధి జరిగిందని, ఇదంతా సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైందని ఉద్ఘాటించారు.

పెద్దవంగర మండలం మేఘ్యా తండాలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచింది కేసీఆరే

- పాలకుర్తి అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర, నవంబర్4: ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచి, తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని పాలకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. గిరిజన తండాలు ఉమ్మడి రాష్ట్రంలో ఎట్లుండే.. స్వరాష్ట్రంలో ఎట్లైనవో ఆలోచించాలని సూచించారు. శనివారం పాలకుర్తి నియోజకవర్గం పెద్దవంగర మండలం కాన్వాయిగూడెం, కొత్తతండా, మేఘ్యా తండా, బలుసుల తండా, అమర్ సింగ్ తండా, రంగి తండా, బత్తాయితోట తండా, శంకర్ తండా, సర్పంచ్ తండాల్లో మంత్రి ప్రచారం నిర్వహించారు. ఆయా తండాల్లో వేర్వేరుగా జరిగిన సభలలో మంత్రి మాట్లాడారు. ఆదివాసీల ఏండ్ల గోసను సీఎం కేసీ ఆర్ తీర్చితే.. అన్నదమ్ముల్లా కలిసి ఉన్న ఎస్టీల్లో వర్గీకరణ చిచ్చుపెట్టడానికి కాంగ్రెస్, బీజేపీలు కుట్ర పన్నుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్ముకుంటే నట్టేట మునిగినట్టేనని, ఆ పార్టీలను తరిమికొట్టాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నామినేషన్ ఖర్చుల నిమిత్తం తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సాయిలు-మాధవి దంపతులు రూ. 10 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని సన్మానించి, ధన్యవాదాలు తెలిపారు. కాగా.. కాన్వాయిగూడెంలో ఓట్లు అభ్యర్థిస్తున్న క్రమంలో వృద్ధురాలు కాసాని మల్లమ్మను 'అవ్వా బాగున్నావా? పింఛన్ వస్తున్నదా? ఓటు ఎవలికి వేస్తావు? అని ఎర్రబెల్లి అడగగా.. వస్తుందయ్యా.. నీకే ఓటు వేస్తాను.. కారు గుర్తుకే.. మళ్లా గెలుపు నీదే.. సీఎం కేసీఆర్ మళ్లా రావాలే.. ఆయనొస్తేనే మాలాంటోళ్లకు ఆసరా' అని బదులిచ్చింది.

యూపీలో 80 సీట్లకూ సన్నద్ధం

- ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్

గోరఖ్‌పూర్, నవంబర్ 4: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా ఏర్పడిన ప్రతిపక్ష కూటమి ఇండియాలో చీలికలు తప్పేట్లు లేవు. కూటమిలో భాగస్వామిగా ఉన్న సమాజ్‌వాదీపార్టీ శనివారం కీలక ప్రకటన చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని మొత్తం 80 లోక్‌సభ స్థానాలకు తమ పార్టీ సన్నద్ధమవుతున్నదని పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. 'మేమైతే 80 స్థానాలకూ సన్నద్ధమవుతున్నాం. అందులో భాగస్వామ్య పార్టీలకు ఎన్ని సీట్లు వెళతాయన్న విషయం తర్వాత తెలుస్తుంది.' అని ఆయన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే మహిళలకు నెలకు మూడు వేల పెన్షన్ అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

జైలు నుంచి తప్పించుకొన్న గినియా మాజీ నియంత

కొనాక్రి, నవంబర్ 4: గినియా మాజీ నియంత మౌస్సా డాడిస్ కెమెరా జైలు నుంచి తప్పించుకున్నారు. కొందరు సాయుధ ముష్కరులు శనివారం తెల్లవారుజామున దేశ రాజధాని కొనాక్రిలోని జైలుపై దాడి చేసి ఆయనను విడిపించుకుపోయారని గినియా న్యాయ శాఖ మంత్రి చార్లెస్ అల్ఫోన్స్ వెల్లడించారు. మౌస్సాతో పాటు 2009లో ఓ స్టేడియంలో 157 మంది నర మేధానికి కారణమైన కేసులో శిక్ష అనుభవిస్తున్న ఇద్దరు దోషులు కూడా తప్పించుకొన్నవారిలో ఉన్నారని ఆయన చెప్పారు.

మహబూబ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో మాజీ మంత్రి చంద్రశేఖర్

దొంగ సర్వేల పేరిట మోసం

- కాంగ్రెస్‌కు ఓట్లేస్తే.. పరిశ్రమలన్నీ కర్ణాటకకే
- మీడియా సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 4: దొంగ సర్వేల పేరిట కాంగ్రెస్ నేతలు మోసానికి పాల్పడుతున్నారని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి పీ చంద్రశేఖర్, మైనార్టీ నాయకుడు సయ్యద్ ఇబ్రహీంతో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే.. తెలంగాణ పరిశ్రమలన్నింటినీ కర్ణాటకకు తరలిస్తారని హెచ్చరించారు. హైదరాబాద్‌లో నెలకొల్పనున్న ఐఫోన్ పరిశ్రమను తరలించేందుకు కర్ణాటక ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహబూబ్‌నగర్‌లో నీచులు, దౌర్భాగ్యులు ఉన్నారని, వారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం సయ్యద్ ఇబ్రహీం మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు బీసీలకు ఇవ్వాల్సిన టికెట్లను అమ్ముకొని.. బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం చేశారని దుయ్యబట్టారు. మాజీ మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బీజేపీలో డబ్బులు ఉన్నవారిని మాత్రమే పలుకరిస్తారని, బీసీలను సీఎం చేస్తామని చెప్పున్న బీజేపీ నేతలు.. బీసీ అభ్యర్థులకు మాత్రం టికెట్లు కేటాయించలేదని విమర్శించారు. బీజేపీ సోషల్ మీడియాకు చెందిన యువకులు 50 మంది మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

19న ఎయిర్ ఇండియాలో ప్రయాణించొద్దు

- సిక్కులకు ఖలిస్థాన్ తీవ్రవాది గుర్‌పత్వంత్ హెచ్చరిక

న్యూఢిల్లీ, నవంబర్ 4: ఈ నెల 19న ఎయిర్ ఇండియా విమానాల్లో సిక్కులు ప్రయాణించొద్దని ఖలిస్థాన్ తీవ్రవాది గుర్‌పత్వంత్ సింగ్ హెచ్చరించారు. 'నవంబర్ 19న ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దని మేము సిక్కులను కోరుతున్నాం. ఆ రోజు ప్రపంచ దిగ్బంధం ఉంటుంది. మీ ప్రాణాలకు ప్రమాదం' అని గుర్‌పత్వంత్ ఒక వీడియోలో హెచ్చరించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నవంబర్ 19న ఢిల్లీ విమానాశ్రయాన్ని మూసేయనున్నట్టు.. దాని పేరును మార్చనున్నట్టు గుర్‌పత్వంత్ చెప్పారు. అదే రోజు క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ జరుగుతుండటాన్ని గుర్తుచేశారు. ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధం నుంచి మోదీ పాఠాలు నేర్చుకోకపోతే అలాంటి ప్రతిస్పందనే భారత్‌లో ఎదుర్కోవాల్సి ఉంటుందని గత నెల 10న గుర్‌పత్వంత్ ప్రధాని మోదీకి హెచ్చరికలు చేశారు.

టికెట్లు అమ్ముకునే సంస్కృతి కాంగ్రెస్‌దే

- మాయమాటల పార్టీని నమ్మొద్దు
- బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల

చేగుర్తిలో మంత్రి గంగుల కమలాకర్‌కు తిలకం దిద్దుతున్న వృద్ధురాలు

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 4: ఎన్నికల వచ్చాయంటే చాలు బీ ఫాంలు, టికెట్లను అమ్ముకునే సంస్కృతి కాంగ్రెస్ పార్టీదేనని, మాయమాటలు చెప్పే ఆ పార్టీ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. శనివారం కరీంనగర్ నియోజకవర్గంలోని కరీంనగర్‌రూరల్ మండలం చేగుర్తి, నల్లగుంటపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, మహిళలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో బీఆర్‌టీయూ అనుబంధ కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సాయంత్రం కరీంనగర్‌లోని 9, 11, 32 డివిజన్లలో ఇంటింటి ప్రచారం సాగించారు. ఆయాచోట్ల మంత్రి గంగుల ప్రసంగిస్తూ.. కర్ణాటక ఎన్నికల్లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అక్కడి ప్రజల్ని మోసం చేసిందని విమర్శించారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటుతో పాటు సాగునీరు, రైతుబంధు, రైతుబీమా ఇస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మహిళల కోసం సౌభాగ్యలక్ష్మి కింద రూ.3 వేలు, రూ.400లకే గ్యాస్ సిలిండర్‌ను అందించనున్నామని చెప్పారు. అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు అండగా నిలిచి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమాల్లో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హర